# లక్ష్మణ రేఖ

సాయంత్రం ఆరింటిదాకా ఆఫీసు ఫైళ్లతో కుస్తీపట్టీ, కాస్సేపు క్లబ్బులో గడిపి తొమ్మిదింటికి ఇంటికెళ్లడం ఆనవాయితిగా మారింది. ఆఫీసులో నేను బాస్‌ను. ఇంటి ఇల్లాలు జానకి నాకు బాస్. జానకి మెడలో మూడుముళ్లేసిన మహూర్తబలమేమోగాని ఆమె మాటకెదురు చెప్పాలంటే నా మనసు నాకే ఎదురు తిరుగుతుంది. పిల్లలిద్దరూ రెసిడెన్షియల్ స్కూల్లో చదువు"కొంటు"న్నారు. ఇల్లాలి గాజుల గలగలలు వింటూ సుష్టుగా భోంచేసి నిద్రపోవడం రొటీనైపోయింది.

ఆ రోజు శనివారము. తెల్లవారితే సండే.. హోలీ–జాలీడే. అర్ధాంగితో కలిసి రాత్రికి భోంచేసేటప్పుడు ఆదివారం ప్రోగ్రాం ఫిక్సయింది. పొద్దున ఇంట్లో ఉప్మాపెసరట్టు టిఫిన్, మార్నింగ్ షో సినిమా, అట్నుంచటే స్టార్ హోటల్‌కెళ్లి భోంచెయ్యడం, ఇంటికొచ్చి నడుం వాల్చడం. ఆ తర్వాత మా సహోద్యోగి కూతురు పెళ్లికెళ్లాలి. నిద్ర ముంచుకొస్తుంది.... అప్పుడే సెల్‌ఫోన్ అరిచి గీపెట్టింది.

చఛ... పానకంలో పుడక. ఫోన్ జానకి కందించాను. మాట్లాడింది. నా భుజమ్మీద చెయ్యేసి "మా తమ్ముడు సతీష్ మాట్లాడిండు. రేపు మా లక్ష్మయ్య కూతురు పెళ్లిగదా. సతీషేవచ్చి కార్డు ఇచ్చి వెళ్లాడుగదా. మనం మరిచిపోయినం" గోముగా నిమిరింది.

"మరిచిపోతే పోయాంలే, కొంపలు మునిగిందేమీ లేదు గదా!"

"అదికాదండీ! రేపుదయం మనం వెళ్లాలి. లక్ష్మయ్య గూడా మాట్లాడిండు. పొద్దున్నే బయలుదేరుమన్నడు."

సతీష్ ఆమె తమ్ముడు. సుల్తాన్ బజార్లో కట్టెలమండి. మండి ఆనుకుని ఇల్లు. కట్టెలమండి షాపు నిండా వంటచెరుకుల రాశులు, బొగ్గుల కుప్పలతో నిత్యకళ్యాణం పచ్చతోరణం లాగుంటుంది. ఆషాపులో లక్ష్మయ్య నెలజీతం పనివాడు. నమ్మినబంటు గూడా. హైద్రాబాదులో అలాంటి మనిషి దొరకడం అదృష్టమే.

కమ్మని నిద్రకు రెక్కలొచ్చి ఎగిరిపోయింది. కూడబెట్టిన ఆస్తినెవరో కొల్లగొట్టుకు పోతున్నట్టనిపించింది.

"రేపటి ప్రోగ్రాం ఫిక్సయింది గదా!" గొణుక్కుంటూ లేచి కూచున్నాను. జీరో లైటు ఆర్పేసి ట్యూబులైటు వేసింది. "ప్రోగ్రాం మార్చేద్దామడీ. పెసరట్టుకు నేనింకా పప్పు నానబొయ్యలేదు. అమ్మో...! లక్ష్మయ్య కూతురు పెళ్లికెళ్లకుంటే నేను మావాళ్ల మధ్య మొహమెత్తుకు తిరగలేను" గుండెల మీద చెయ్యేసుకుంది.

"అట్లంటే ఎట్లనోయ్?"

"మార్నింగ్ షో మరెప్పుడన్నా చూడొచ్చు. మీ కొలీగ్ కూతురు పెళ్లికంటే ఇది చాలా ముఖ్యం" బుంగమూతి.

"కొలీగ్ కూతురు పెళ్లికంటే కూలివాని పెళ్లి ముఖ్యమా?"

జానకి కళ్లల్లో రోషం ఛాయలు. మా లక్ష్మయ్య నాకు అన్నలాంటివాడు. అతన్నంత తేలిగ్గా తీసిపారెయ్యొద్దు.." ట్యూబులైటు వెలుతురు మూడురాళ్ల ముక్కుపుడకను తళుక్కుమనిపించాయి. ఎగిరిపడుతున్న ఆమె గుండెల్ని చూస్తున్నాను.

"చిన్నప్పుడు లక్ష్మయ్య వేలుపట్టుకుని నడక నేర్చుకున్నాను. అతని ఒడిలో ఆడుకున్నాను గదా!" అలకపాన్పెక్కినట్టుంది.

జానకి పుట్టింది మారుమూల పల్లెటూళ్లో కాని పెరిగింది హైదరాబాదులో... వాళ్ల అమ్మమ్మ ఇంటిలో. మేనత్త-మామలు అమ్మానాన్నలయ్యారు. వాళ్లే పెంచి చదువు చెప్పించారు. పెళ్లిచేసి కన్యాదాన ఫలాన్నందుకున్నారు. పెళ్లైన కొత్తలో జానకి చెప్పిందిదంతా. అదంతా బుర్రలో గిర్రుమనేసరికి జానకి కొత్తగా కనబడింది.

"ఏమండీ! ఏమాలోచిస్తున్నారూ? రేపు ఆదివారం ఆఫీసు సెలవు గదా!" భుజంపట్టి కుదిపింది. ఆ స్పర్శ వింత అనుభూతినిచ్చింది.

"అప్టరాల్ ఓ పనివాడి కూతురు పెళ్లికోసం..." ఆమె వాలకం చూసి ఆగిపోయాను. వెంటనే జానకి మొహం వాడిపోయయిన వంకాయలాగైంది. "మా లక్ష్మయ్యను పనివాడిగా మేమెప్పుడూ చూడలేదు. ఇంటి మనిషిలాగానే చూస్తున్నామండీ!" రుసరుసలో బుసబుసలు.

"అంత బిల్డప్ ఎందుగ్గానీ...లక్ష్మయ్య కట్టెలు కొడ్తాడు... బొగ్గులు రాశులు పోస్తాడు. షాపు శుభ్రం చేస్తాడు. అతని రిక్షాలో కట్టెలు, బొగ్గులు కొనుగోలుదార్ల ఇంటికి తీసుకుపోతాడు."

"అయితే ఏంటటా? అతడో కష్టజీవి. చెమట బిందువుల్ని నమ్ముకుని బతుకుతున్న స్వయంకృషీవలుడు" బాధగా గొంతు వణికింది.

వాళ్లింట్లో అందరూ లక్ష్మయ్యతో ఆప్యాయంగా మాట్లాడ్డం, పక్కన కూచోబెట్టుకుని కలిసి భోంచెయ్యడం నేను చూశాను కానీ... మనసులో గుంజాటన. నేనెప్పుడు వెళ్లినా ప్రేమగా పలుకరిస్తాడు. "మా జానకమ్మ బాగుందాయ్యా!" అని మొదట అడుగుతాడు.

"ఎప్పుడొచ్చినా ముందు జానకి గురించే అడుగుతావెందుకూ" అంటే ఆయమ్మ అదృష్ట జాతకురాలయ్యా!" అంటూ తాబేలులా ముడుచుకుపోతాడు.

జానకి మెడలో మూడుముళ్లేసిన సంవత్సరంలోగా నేను ఆఫీసర్ ప్రమోషన్ మెట్టెకిన మాట వాస్తవమేకానీ... అది నా కృషి ఫలితమే గదా!... అవన్నీ గుర్తుకొచ్చాయి.

"సరే జానకీ! పొద్దున్నే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ బస్‌లో వెళ్దాం, సరేనా!" బుగ్గ గిల్లాను కిలకిలా నవ్వింది... అది మంచుకొండమీద పున్నమి వెన్నెల తుళ్లిపడ్డట్టుంది. కపోలాల మీదాడుకుంటున్న ముగురుల్ని నాజుగ్గా సవరించుకుంది.

xxxx

రాజీవ్ రహదారి పై భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ వయ్యారంగా పరుగెడుతోంది. కిటికీలోంచి ప్రకృతి సౌందార్యాన్నాస్వాదిస్తున్నాను.

"బస్సుదిగి డైరెక్టుగా కళ్యాణమంటపాని కెల్దామా లేక మా అమ్మవాళ్లింటి కెల్దామా?" జానకి భుజం తట్టింది.

"మీ అమ్మవాళ్ళిల్లు కళ్యాణమంటపం దగ్గరేగదా! ముందు ఇంటికెళ్లి ఫ్రెష్‌గా తయారై పెళ్లికెల్దాము."

"పెళ్లికి చాలా ముందుగా రావాలని పొద్దున్నే లక్ష్మయ్య ఫోను చేసిండు. మావాళ్లంతా కళ్యాణమంటపంలోనే ఉన్నారట. తమ్ముడు సతీష్ మాత్రమే ఇంట్లో ఉన్నాడట. మనం బయలుదేరేముందు ఫోనొచ్చింది." మురిపాలమూట విప్పిందని ముఖకవళికలు చెప్తున్నాయి.

"నువ్వేమీ టెన్షన్ పడకు. పెళ్లికి గంటన్నరముందు అక్కడుంటాము." సీటుకొరిగి కళ్లు మూసుకున్నాను.

మనసు తెరమీద లక్ష్మయ్య ప్రత్యక్షమయ్యాడు.

ఓసారి... దీపావళి పండక్కి అత్తారింటి కెళ్లాను. ఉదయం హారతులప్పుడు కొత్త బట్టలతో లక్ష్మయ్య హాజరయాడు. మధ్యాహ్నం భోజనాలవగానే అందరం నడుములు వాల్చారు. పగటినిద్ర నాకలవాటు లేదు. కిటికీలోంచి మండీలోకి చూశాను. రోజూ కష్టమర్లతో కిటకిటలాడే మండీ నిర్మానుష్యంగా వుంది.. ఒంటరిగా లక్ష్మయ్య స్టూలుమీద కూచున్నాడు. కొత్త ధోవతి, తెల్లషర్టు... చూపులు తురాయిచెట్టుమీదున్నాయి.

మండీలోకెళ్లాను. నా ఉనికిని గమనించాడు. "కూచోండి అల్లుడయ్యా!" తన ముందున్న కుర్చీని తువ్వాలుతో తుడిచి చూపించాడు. తురాయి చెట్టు షాపు మధ్యనుంది. గాలి తరగలతో సయ్యాటలాడుతున్న తురాయి రెమ్మలు ఆకులు రాలుస్తున్నాయి. నాకంటే లక్ష్మయ్య వయసులో పెద్ద... అయినా చేతులు కట్టుకుని నుంచున్నాడు. అది నాకు బాగన్పించలేదు. "కూచో లక్ష్మయ్యా!" అంటూ కుర్చీలో జేరగిలబడ్డాను.

స్టూలు కదలకుండా కూచుంటూ "మా జానకమ్మ వంట బాగా చేస్తది గదయ్యా. ఆమెది అదృష్టదజాతకం." కూచుంటూ తువ్వాలు భుజమ్మీదేసుకున్నాడు. మళ్లీ పాతపాటలందుకుంటా డనుకున్నాను.

"ఆమె సంగతి సరేగానీ, నీ సంగతి చెప్పు ఈ రోజు పండుగనాడు కూడా ఇక్కడే ఉన్నావు. భార్యాపిల్లలు నీకోసం ఇంటివద్ద ఎదురుచూడరా?" మాటల్లోకి దింపాను.

"నా భార్యా పిల్లలు నిన్ననే మా ఊరికి పోయింద్రయ్యా!"

"నీ కెందరు పిల్లలు?"

"ఇద్దరాడపిల్లలయ్యా!"

"వాళ్లతో గడపాలన్పించలేదా?"

"చాలా రోజుల తర్వాత మా జానకమ్మ వచ్చిందిగదయ్యా! ఆయమ్మను కళ్లారా చూడాలని ఇక్కడే ఉన్నా. మీతో కలిసి భోంచేసినందుకు ఖుషీగా వుందయ్యా!"

అది అసలు నిజమో, అతిశయోక్తో అర్థం కాలేదు. "పండుగనాడు భార్యాపిల్లలతో గడపడము కంటే జానకమ్మను చూడ్డమే ముఖ్యమా?"

"తమరట్లా అడిగితే.. నేనేంజెప్పాలయ్యా! ఆయమ్మను చూస్తే నాకంతా శుభం జరుగుతుందయ్యా."

మంచి మాటలతో నన్ను మనగచెట్టెక్కించి పండగ బహుమతి దండిగా దండుకోవా లనుకుంటున్నాడేమో! "అద్సరేగానీ! మీదేవూరు? ఇక్కడికెప్పుడొచ్చావు?" మూలనున్న బొగ్గులరాశిని చూస్తు అడిగాను.

ఓ నిట్టూర్పు విడిచాడు. "మా ఊరు పాములపర్తి... పల్లెటూరయ్యా!. హైదరాబాదుల బస్సెక్కితే గంటన్నరలో మా ఊళ్లో దిగొచ్చు. మా నాయన కులవృత్తిని నమ్ముకుని చెప్పులు కుట్టేవాడు. మాకో ఎకరం పొలము, మోటబాయుండేది. పొలంలో పండిన గింజలు తిండికి సరిపోయేటివి. కులకప్పి తోని మిగతా ఖర్చులు సరిపోయేవి. ఊర్లో రైతులకు చెప్పులు, మోటబాయి బొక్కెనలకు తొండాలు కుట్టిచ్చేవాడు. పంటలు పండగానే రైతులు మాకు ధాన్యం కొలిచిచ్చేవారు. వేరేవాళ్లుగూడా నగదు పైసలిచ్చి చెప్పులు కుట్టించుకునేవారు. రోజులు హాయిగా గడిచేవి. నాకో అన్న ఉన్నాడు. అతడు కులకప్పి నేర్చుకున్నాడు.

రానురాను జనాలు మేము చేసిన కిర్రుచెప్పులు వాడకం బంద్ జేసింద్రు. ఫ్యాషన్ చెప్పులకలవాటు పడ్డరు. వానలులేక, నీళ్లులేక మోటబాయిలు ఎండిపోయినై. మోటబొక్కెన్ల అవసరం లేదాయె. పొలాలల్ల బోరువాయిలు తవ్వి మోటర్లు పెట్టుకుంటున్నరు. మాకులకష్టి మూల పడ్డది. ఇంగ ఇప్పుడైతే బోరుబాయిలు కూడా బోర్లపడ్తున్నాయి" తువ్వాలు దులిపి భుజమ్మీదేసుకున్నాడు.

గాలికి రాలిపడ్తున్న తురాయి ఆకులు, పూలు మమ్మల్ని అభిషేకిస్తున్నాయి. మళ్లీ ప్రారంభించాడు.

"నేను చిన్నప్పుడు బడికి పోయేటోన్ని. గప్పుడు మా ఊరి దేవుని గుడిల ఏదో యాగం చేసింద్రు. యాగం కోసం జువ్వి కట్టలు ఇంకేవేవో సరుకులు తెమ్మని మా నాయనను హైదరాబాదు తోలిచ్చింద్రట. మా నాయన జువ్వి కట్టెల కోసం ఈ కట్టెలమండి కొచ్చిండటా. గప్పుడే మీ మామ గీ మండిల పనిచేసేందుకో మనిషి కావాలన్నాడట. బస్... నన్ను దీసుకొచ్చి వీళ్లకప్పజెప్పిండు. ఇక్కడనే తినుకుంట, పంజేసుకుంట చాన రోజులున్న. నాకు పనంతా నేర్పించిండు మీ మామ. పొద్దున్నే మండీ షాపంతా ఊడ్చి దుకాణం తెరవడం, రాత్రికి బంద్‌జెయ్యడం అలవాటైంది. రెక్కల కష్టం జేసుకుంట ఇక్కడనే వున్న."

"మరి... ఆ రిక్షా ఎక్కడిది?"

"మీ మామ మారాజు కొనిచ్చిండు. ఇక్కడ కట్టెలు, బొగ్గులు కొనుక్కున్నోళ్లింటికి రిక్షాల తీస్కపోతా. రిక్షా కిరాయిలు నేనే తీస్కుంట." గారపళ్లమీద చిరునవ్వు తళుక్కుమంది.

"మరి... నీ పెళ్లెప్పుడైందీ?"

"మండీల పనంతా నేర్చుకున్నంక చాలా రోజులకైంది. నా భార్య మా ఊరిపిల్లనే. మీ అత్తామామలే దగ్గరుండి పెళ్లిచేసింద్రు. అప్పటికే మీ మామకు పెండ్లయి పదేండ్లయింది కానీ పిల్లలు కాలేదు. ఎన్నో పూజలు చేసింద్రు. జానకమ్మను తెచ్చుకుని పెంచుకున్నరు. ఆమె బడికి పోతున్నప్పుడు సతీషయ్య పుట్టిండు. అటెన్క మీ మరదలు శారదమ్మ పుట్టింది. అదంతా జానకమ్మ ఈ ఇంటికొచ్చిన మహిమనేనయ్యా?"... ఏదో జానపదంలా చెప్పేశాడు. నేనూరుకోలేదు. "జానకి ఐదేండ్లున్నప్పుడు సతీష్ పుట్టిండుగదా! అది జానకి మహిమెట్లా అవుద్దటా? అది మీ మూఢనమ్మకం." నా కనుబొమలెగరిపడినై.

"కానే కాదయ్యా. అది జానకమ్మ మహిమనే." నా అభిప్రాయాన్ని తీసిపారేశాడు. వాలకం గంభీరమైంది.

పాపం అమాయకుడు. ఇంకేమన్నా అంటే బాధపడొచ్చు.

"మీ ఇల్లు ఇక్కడికి దూరమా?"

"దూరము కాదు. చాల దగ్గరకాదు. కిరాయి కొంప. వసతులన్ని ఉన్నాయి. నా ఇద్దరు ఆడపిల్లలు సర్కారు బడిల సదూకుంటున్నారయ్యా!"

రోడ్డుమీద వాహనాల రొద పెరిగింది.

"సరే లక్ష్మయ్యా! ఇదో పండగ మామూలు తీస్కో!" అంటూ వందనోటు పర్సులోంచి తీశాను.

"హయ్యా!" ఉలిక్కిపడ్డాడు. తువ్వాలు దులిపి నెత్తిమీది కప్పుకున్నాడు. "నాకెందుకయ్యా పండగ మామూలు. మా జానకమ్మ చల్లగుంటే చాలు." నోటు లాక్కుని నా జేబులో ఉంచాడు....

"అదో... కోఠీ స్టేజి వచ్చింది. మనం దిగాలి" జానకి బుజం తట్టింది. ఈ లోకంలోకొచ్చాను.

ఆటో కట్టెల మండీ ముందాగింది. మండీలోంచి ఇంట్లోకొస్తున్నాము. సతీష్ పరుగెత్తుకొచ్చి నా చేతిలోంచి సూట్‌కేసు తీసుకుని కుశల ప్రశ్నలు వేశాడు. ఇటు జాబ్‌చేస్తూ అటు లా పాసవడం అతని ప్రత్యేకత.

"మీరు రాగానే కార్లో తీసుకురమ్మని నాకప్పజెప్పింద్రు బావా!"

"అయ్య రాకపోతే అమావాస్య అగుతుందా? మేము రాకపోతే పెళ్లాగిపోతుందా?" అందామనకున్నాను గాని అనలేకపోయాను. "చాల్లేవోయ్ కోతలు!" అనగలిగాను.

ప్రయాణబడలికి సోఫాలో కూచోబెట్టింది. అప్పటికే ముళ్లమీదున్నట్టున్న సతీష్ కారు బయటకు తీశాడు. ఫ్రెషప్ అయి బయలుదేరాము.

ముహూర్తానికింకో గంట టైముంది. కళ్యాణమంటపం హడావుడిగా వుంది. లక్ష్మయ్య ఎవరికో ఏదో పని పురమాయిస్తున్నాడు. మమమల్నిచూసి హుషారుగా ఎదురొచ్చాడు. "హమ్మయ్య... వచ్చింద్రా! తొందరగ తయారవుంద్రి" మా చేతులందుకుని లోపలికి తీసుకెళ్లాడు. ఆ తర్వాత పెళ్లికూతురు ముందుకు తీసుకెళ్లి "జానకత్తమ్మ వచ్చిందమ్మా!" మమ్మల్ని చూపించాడు.

పెళ్లికూతురు ముఖారవిందము వేయిరేకులుగా విచ్చుకుంది. జానకి ఒడిలోచేరి గుండెలమీద ఒరిగిపోయింది. " మా మంచి అత్తయ్య. నాకు తెలుసు తప్పకుండా వస్తారని" పొంగిపోయింది. ఆ అమ్మాయి బుగ్గమీది తేనెరంగు పుట్టుమచ్చను నిమురుతూ జానకి "పిచ్చిపిల్లా! నీ పెళ్లికి రాకుండా ఉంటానా?" నుదురు ముద్దాడింది. "బంగారు బొమ్మలాగున్నావు. నా దిష్టే తగులుతుందేమో!" మెటికలు విరుచుకుంది.

లక్ష్మయ్య భార్య సంతోషంతో "మీ కోసమే ఎదురుచూస్తున్నామయ్యా!" అటుంటే నుదుటి కుంకుమబొట్టు ఉదాత్తంగా మెరిసింది.

పెళ్లి పందిట్లోంచి నాదస్వరం కమ్మగా వినబుతోంది.

"తొందరగా తయారవండి" ఆమెనే పురమాయించింది.

"మేము తయారయే వచ్చాం. మీరు త్వరగా తయారు కావాలి" అన్నాను.

లక్ష్మయ్య చేతులు జోడించి "పెళ్లిపీటలమీద మీరు, జానకమ్మ కూచోవాలి" నవ్వాడు. పెళ్లిబట్టలివ్వబోయాడు.

జానకి, నేను మొహాలు చూసుకున్నాము. "అదెట్లా? కనిపెంచినవారు మీరుండగా మీ అమ్మాయి పెళ్లిలో మేము పీటలమీద కూచోవడమేమిటి?" అయోమయంలోంచి బయటపడింది జానకి.

"నేనదే అన్నాను బావా!" సతీష్ అందుకున్నాడు. "మొన్నటి నుండి చెప్తున్నా వినడం లేదు. మా అమ్మా-నాన్న చెప్పినా వినలేదు. కన్యాదానం అక్కచేతులమీదుగా జరగాలని ఉడుంపట్టు పట్టిండు."

అప్పుడే జానకి అమ్మా-న్నాలొచ్చారక్కడికి. "నా తల్లీ! బంగారు కొండా!" అత్తగారు జానకిని గుండెలకు హత్తుకుంది.

"అక్క బంగారు కొండయితే, మరి నేనో!" మరదలు బుంగమూతి పెట్టింది. "అక్క తర్వాతనే

నువ్వు గదమ్మా. అక్క బంగారు కొండయితే నువ్వు ముద్దుల మూటవు." నెత్తిమీద ఒక్కటొచ్చింది. కోరస్‌గా నవ్వారంతా. మామయ్య కనుబొమలెగిరిపడ్డాయి.

"తొందరగా పెళ్లిబట్టలు కట్టుకోండయ్యా!" లక్ష్మయ్య పట్టుబట్టాడు.

ఎలా స్పందించాలో అర్థంగాక నా మనసు మూగబోయింది.

"అయ్యా!" చేతులందుకుని కళ్లకద్దుకున్నాడు లక్ష్మయ్య. "నా పెండ్లయిన ఐదేండ్ల దాకా నాకు పిల్లలు పుట్టలేదు. జానకమ్మ మా ఇంటికొచ్చి పాలబువ్వ తిన్న సంవత్సరంలోగా పెద్దమ్మాయి... అదే... ఈ పెళ్లికూతురు పుట్టింది. ఆమె చేతుల్తో కన్యాదానం చేస్తే నా బిడ్డగ్గూడా జానకమ్మ అదృష్టమొస్తుంది. కాదనకయ్యా!" గొంతు వణికింది. కళ్లల్లో ఆర్ద్రత.

విచిత్రమైన అవస్థలో కొట్టుమిట్టాడుతున్నాము. సడన్‌గా లక్ష్మయ్య భార్య జానకి కాళ్లకు దండంబెట్టింది. నా ముందుకొచ్చి చేతులు జోడించి "జానకమ్మ మా దేవతయ్యా! కాదనకండయ్యా!" జానకి చేతులందుకుని కళ్లకద్దుకుంది.

నా అంతరంగాల్లో జాలువారిన ఉద్వేగపు తరంగం కళ్లను తడిచేసింది. ఏమనాలో తోచక జానకివైపు చూశాను - అభిప్రాయం కోసం.

"మనకు ఆడపిల్లలు లేరుగదా! ఈ అమ్మాయే మనమ్మాయి అనుకుందామండీ!" నా చెవిలో చెప్పింది. భావోద్వేగపు ఆనవాళ్లు ఆమె కళ్లల్లో కనబడ్డాయి.

చిప్పిల్లిన నా కన్నీటి పొరల్లోంచి జానకిని ఆపాదమస్తకం తడిమాను.

××××

(నది, నవంబర్-2012)

